## జొన్నలు పట్టివేత

బజార్‌హత్నూర్, ఏప్రిల్ 29 : మహారాష్ట్ర నుంచి తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండల కేంద్రంలోని జొన్నల మార్కెట్ సబ్‌సెంటర్‌కు అక్రమంగా తీసుకొచ్చిన జొన్నలను మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. బోథ్ సీఐ వెంకటేశ్వరావు వివరాల ప్రకారం.. మహారాష్ట్రలో విస్పూర్ గ్రామం నుంచి ఘన్‌పూర్ చెక్‌పోస్టు మీదుగా ఎంహెచ్26సీహెచ్ 2361 వాహనంలో బజార్‌హత్నూర్ మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన ముర్కుటే గజానంద్ 30 క్వింటళ్ల జొన్నలను అక్రమంగా తీసుకొచ్చాడు. బజార్‌హత్నూర్ మండల కేంద్రంలోని మార్కెట్ కేంద్రంలో అమ్మడానికి ప్రయత్నించగా రైతులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని జొన్నల వాహనాన్ని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రశాంతంగా కామన్ ఎంట్రన్స్ టెస్ట్

ఎదులాపురం, ఏప్రిల్ 29 : ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ సెట్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ మంగళవారం ప్రారంభమైంది. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్ష జరిగింది. జిల్లా కేంద్రంలోని నలంద కళాశాలలో అగ్రికల్చర్ పరీక్ష కొనసాగగా అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరంలోనికి అనుమతించారు. అభ్యర్థుల రిజిస్ట్రేషన్, అర్హత పరీక్ష హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీ తదితర వాటిని తనిఖీ చేశారు. నిమిషం ఆలస్యం నిబంధన కారణంగా అభ్యర్థులు గంట ముందుగానే కేంద్రానికి చేరుకున్నారు. కాగా ఉదయం పరీక్షకు 100 మందికి 97 మంది, మధ్యాహ్నం పరీక్షలకు వంద మంది హాజరైనట్టు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ పున్నారావ్ తెలిపారు.

## మహిళల రక్షణ కోసమే షీటీం

ఎదులాపురం, ఏప్రిల్ 29: మహిళల రక్షణ కోసమే షీటీం పని చేస్తున్నదని ఏఎస్ఐ సుశీల తెలిపారు. మంగళవారం బీసీ స్టడీ సర్కిల్‌లో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు షీటీం పనితీరుపై అవగాహన కల్పించారు. స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొంది కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన లావణ్య, శృతిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ, అకతాయిలు వేధించిన, ఈవీటీజింగ్ చేసినా డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. నిర్భయంగా వేధింపులపై ఫిర్యాదు చెయొచ్చని తెలిపారు. కార్యక్రమంలో బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, సిబ్బంది, అభ్యర్థులు, షీటీం సభ్యులు పాల్గొన్నారు.

## భూ భారతి చట్టంపై అవగాహన ఉండాలి

తలమడుగు/జైనథ్, ఏప్రిల్ 29 : రైతులు భూ భారతి చట్టంపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం తలమడుగు మండల కేంద్రంలోని ఆయుష్ గార్డెన్‌లో, జైనథ్ మండలం సాత్నాల మండలంలోని మేడిగూడ (ఆర్) గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు భూ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ సలోని, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, తహసీల్దార్ రాజ్‌మోహన్, డీటీ ప్రభాకర్, ఆర్ఐ రోహిదాస్, జూనియర్ అసిస్టెంట్ సాయి, పీఏసీఎస్ చైర్మన్లు పాల్గొన్నారు.

## శిశువులకు తల్లిపాలు తాగించాలి

ఎదులాపురం, ఏప్రిల్ 29 : శిశువులకు పుట్టిన వెంటనే గంటలోపు తల్లిపాలు తాగించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ నరేందర్ రాథోడ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని డీఎంఅండ్‌హెచ్‌వో సమావేశ మందిరంలో మంగళవారం సంకల్ప కార్యక్రమంపై ఐసీఎంఆర్ బృందంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎంహెచ్‌వో డాక్టర్ నరేందర్ రాథోడ్ హాజరై మాట్లాడారు. మాతా శిశు మరణాలను తగ్గించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాలు అధికారి వైసీ శ్రీనివాస్, సంకల్ప నోడల్ అధికారి తన్ని జై, పీహెచ్‌సీ వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

## నకిలీ విలేకరిపై కేసు

బేల, ఏప్రిల్ 29 : మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిభా పూలే బీసీ బాలుర గురుకులం పాఠశాల ప్రిన్సిపల్ రంగన్న ఫిర్యాదు మేరకు నకిలీ విలేకరి యముర్లవార్ దీపక్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని జైనథ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డీ సాయినాథ్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 28న విలేకరి నంటూ బ్లాక్ మెయిల్‌కు పాల్పడి రూ.500 తన వద్ద తీసుకున్నాడని ఫిర్యాదులో ప్రిన్సిపల్ పేర్కొన్నారని తెలిపారు. ఇలా ఎవరైనా అక్రమ వసూళ్లకు పాల్పడితే, చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో ఏఎస్ఐలు లింగన్న, కనక జీవన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## నిర్మల్‌లో అర్ధరాత్రి పోలీసుల తనిఖీలు

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 29 : నిర్మల్ పట్టణంలో సోమవారం అర్ధరాత్రి ఏఎస్పీ రాజేశ్ మీనా ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. అర్ధరాత్రి రోడ్లపై వాహనాలతో తిరుగుతున్న మైనర్లను పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ రాజేశ్ మీనా మాట్లాడుతూ, మైనర్లు వాహనం నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని అన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం వాహనదారులకు ప్రమాదాలపై అవగాహన కల్పించారు.

## ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 29 : రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించిందని ఏఎస్పీ ఉపేందర్ రెడ్డి అన్నారు. ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా మైనర్ డ్రైవింగ్‌లో పట్టుబడిన 91 మంది మైనర్లు, 107 మంది తల్లిదండ్రులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ, మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. అలాగే కొందరు రాత్రి వేళల్లో మద్యం తాగి వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వీటిని పూర్తిగా అడ్డుకునేందుకు విస్తృత తనిఖీలు చేస్తున్నామన్నారు. ఇక్కడ ఆర్ఐలు రాం నిరంజన్, శేఖర్, రమేశ్, రామకృష్ణ, తదితరులున్నారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

ఇచ్చోడ(సిరికొండ), ఏప్రిల్ 29 : ద్విచక్ర వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిరికొండ ఎస్ఐ శివరాం హెచ్చరించారు. మంగళవారం సిరికొండ మండల కేంద్రంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాహనాలకు నంబర్ ప్లేట్ లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి వాహనదారుని దగ్గర లైసెన్స్‌తోపాటు వాహనానికి సంబంధించిన పత్రాలు ఉంచుకోవాలన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రమేశ్, కానిస్టేబుల్ ఉన్నారు.

## ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా

నార్నూర్, ఏప్రిల్ 29: మండలంలోని చోర్‌గావ్ పంచాయతీ పరిధిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేస్తున్నామని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ మంగళవారం పేర్కొన్నారు. తాగునీటి కోసం ప్రజలు ఇబ్బంది పడకుండా నిత్యం పంచాయతీ ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తున్నామని తెలిపారు.

# గంజాయిపై ఉక్కుపాదం

- జిల్లాలో పూర్తిగా గంజాయి నిర్మూలనకు కృషి
- ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్



గంజాయి మొక్కలు పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఇచ్చోడ, ఏప్రిల్ 29 : గంజాయిపై ఉక్కు పాదం మోపాలని, జిల్లాలో గంజాయి మాదకద్రవ్యాలను పూర్తిగ రూపుమాపాలనే లక్ష్యంతో జిల్లా పోలీసు యంత్రాంగం అహర్నిశలు కష్టపడుతూ ప్రజలకు మంచి సేవలందిస్తుందని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. జిల్లాలో ప్రజలు మత్తు పదార్థాలు దూరంగా ఉండాలని కోరారు. సోమవారం ఇచ్చోడ మండలంలోని సల్యాద గ్రామంలో పంట పొలాల మధ్య గంజాయి మొక్కలు పెంచుతున్నారనే సమాచారం మేరకు ఎస్పీ సిబ్బందితో దాడి చేశారు. ఈ సందర్భంగా సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ, నలుగురి పంట పొలాల్లో 180 గంజాయి మొక్కలు లభించినట్లు తెలిపారు. వాటి విలువ బహిరంగ మార్కెట్లో రూ.18 లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గంజాయిని ఆదిలాబాద్ జిల్లాలో లభించకుండా, పండించకుండా, వ్యాపారం చేయకుండా, వినియోగించకుండా చూస్తామని తెలిపారు. గ్రామానికి చెందిన చహకటి సోనేరావు, దుర్వా లవకుష్, అర్క జంగుబాపు, దుర్వా అరుణ్ గంజాయి సాగు చేస్తున్నారన్నారు. ఒక్కొక్క గంజాయి మొక్క బహిరంగ మార్కెట్‌లో రూ.10 వేల వరకు ఉంటుందని తెలిపారు. నలుగురిపై అండర్ సెక్షన్ 8(బీ) ఆర్/డబ్ల్యూ 20(ఏ)(ఐ) ఎన్‌డీపీఎస్ చట్టం-1985తో నాలుగు కేసులు నమోదు చేశామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గంజాయి నిర్మూలనకు జిల్లా పోలీస్ యంత్రాంగం అహర్నిశలు కష్టపడుతున్నదని తెలిపారు. జిల్లాలో గంజాయి సరఫరాదారులు, వర్తక దారులు, వినియోగదారులను కనుగొనేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. గంజాయి నిర్మూలనపై ఎలాంటి సమాచారం ఉన్నా 8712659973 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. గంజాయి మొక్కల స్వాధీనానికి కృషిచేసిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సమావేశంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్ ఐపీఎస్, సీఐ ఈ భీమేశ్, ఎస్ఐ తిరుపతి పాల్గొన్నారు.

## నూతన ఐటీ కార్యాలయం ప్రారంభం



ఐటీ కోర్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఎదులాపురం, ఏప్రిల్ 29 : జిల్లా కేంద్రంలోని పోలీసు ముఖ్య కార్యాలయంలో నూతనంగా సైబర్ సెల్, ఐటీ కోర్ కార్యాలయాన్ని ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రారంభించారు. యూనిఫాం వేసుకున్న పోలీసు సిబ్బంది ప్రజలకు ఒకవైపు కనిపిస్తుండగా మరోవైపు వైపు సిబ్బంది పోలీసు వ్యవస్థకు వెన్నుముఖ మాదిరిగా పనిచేస్తూ, లా అండ్ ఆర్డర్ కంట్రోల్, నేరస్తులను కనుగొనడం, నేరాలు జరగకుండా నియంత్రించడానికి సైబర్ సెల్, ఐటీ కోర్ సిబ్బంది పనిచేస్తూ ఉంటారని తెలిపారు. ముఖ్యంగా నేరస్తులను పట్టుకోవడం, నేరాలు జరిగిన ఘటనలో కేసులను ఛేదించడంలో ముఖ్య భూమిక పోషిస్తూ ప్రజలకు పరోక్షంగా సేవలను అందిస్తున్నారన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో డీఎస్పీ పోతారం శ్రీనివాస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు డి.వెంకటి, టి.మురళి, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ గోపి కృష్ణ, సైబర్ సెల్ ఇన్‌చార్జి సంజీవ్ కుమార్, ఐటీ సెల్ ఇన్‌చార్జి మురాద్ అలీ పాల్గొన్నారు.

## గ్రామ సంఘం ఆడిట్ ప్రారంభం

జైనథ్, ఏప్రిల్ 29 : గ్రామైక్య మహిళా సంఘాల 2024-25 సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలపై ఆడిట్ నిర్వహించినట్లు ఏపీఎం భగవాండ్లు తెలిపారు. మొత్తం 42 గ్రామాల సంఘాల ఆడిట్‌ను పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలినవి వారం రోజుల్లో పూర్తిచేయనున్నట్లు తెలిపారు. గ్రామ సంఘం సంవత్సర కాలంలో నిర్వహించిన ఆర్థిక లావాదేవీలపై క్యాష్ బుక్, జనరల్ లెడ్జ్‌ను వేటింగ్ మినిట్స్ బుక్స్‌లను సీఏలు అనిల్, సీబీవో ఆడిటర్ శ్రీనివాస్ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం భగవాండ్లు, సీసీలు నాందేవ్, శ్రీనివాస్ రెడ్డి, గంగారాం, లక్ష్మి, వీవోఏలు పాల్గొన్నారు.

## వృక్ష శాస్త్రంలో పీహెచ్‌డీ సాధించిన అఫ్రీన్ సుల్తానా

ఎదులాపురం, ఏప్రిల్ 29: వృక్ష శాస్త్రంలో ఆదిలాబాద్ కు చెందిన అఫ్రీన్ సుల్తానా పీహెచ్‌డీ పట్టా సాధించింది. చెరకు, పొగాకు ద్వారా సంభవించే వ్యాధుల నిరోధకతపై చేసిన పరిశోధనకు సహారన్‌పూర్‌లోని గ్లోకుల్ విశ్వవిద్యాలయం పీహెచ్‌డీకి అర్హతగా ప్రకటించింది. అఫ్రీన్ సుల్తానా తన పరిశోధనను సూపర్‌వైజర్ డాక్టర్ విశాల్ కుమార్ చంపా పర్యవేక్షణలో పూర్తి చేసింది. ఆమె పరిశోధనా పరీక్ష వైవా ఫిబ్రవరి 3న విశ్వవిద్యాలయంలో ఎగ్జామినర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రియాంక, సూపర్‌వైజర్ డాక్టర్ విశాల్ కుమార్ చంపా అసిస్టెంట్ ప్రొఫెసర్, ఇతర నిపుణుల సమక్షంలో జరిగిందని తెలిపారు. ఆమెను బంధుమిత్రులు, పట్టణ ప్రముఖులు అభినందనలు తెలియజేశారు.

## భూ భారతి అమలుతో సమస్యల పరిష్కారం

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

కుభీర్/కుంటాల, ఏప్రిల్, 29 : ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం అమలుతో ఎన్నో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. మంగళవారం కుభీర్ మండల కేంద్రంలోని రైతు వేదిక, కుంటాల మండలంలోని అందకూర్‌లో, సోన్ మండల కేంద్రంలోని రైతు వేదికలో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం నూతన భూ భారతిను రూపొందించిందన్నారు. అనంతరం కలెక్టర్ సదస్సుకు హాజరైన ప్రజల భూ సమస్యలు విని పరిష్కారానికి అధికారులకు సూచనలు చేశారు. సదస్సులో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిశోర్ కుమార్, మండల ప్రత్యేకాధికారి శంకర్, తహసీల్దార్ శివరాజ్, ఎంపీడీవో నవనీత్, అధికారులు, ప్రజలు, సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 29 : గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని డీఆర్డీవో రాథోడ్ రవీందర్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి ప్రజావాణి పైలెట్ ప్రాజెక్టు కార్యక్రమంలో ఆయా శాఖలకు చెందిన అధికారులు పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో రాథోడ్ రవీందర్ మాట్లాడుతూ, గ్రామాల ప్రజలు సమస్యలను నేరుగా పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో జీవన్‌రెడ్డి, గిర్దావర్ మెస్రం లక్ష్మణ్, ఏఈ భానుకుమార్, ఈజీఎస్ ఏపీవో జాదవ్ శ్రీనివాస్, ఈవో సంజీవరావ్ పాల్గొన్నారు.

# నిబంధనలు పాటించకపోతే చర్యలు

- డీఎంహెచ్‌వో డాక్టర్ నరేందర్ రాథోడ్



వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నరేందర్ రాథోడ్

ఎదులాపురం, ఏప్రిల్ 29: నిబంధనలు పాటించని దవాఖానలపై చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో డాక్టర్ నరేందర్ రాథోడ్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రైవేట్ హాస్పిటళ్లను సందర్శించారు. పోలీసు, సఖీ, ఎన్జీవో, రిమ్స్ ప్రతినిధులతో ఏర్పాటైన బృందంతో హాస్పిటళ్లలో వసతులు, వైద్యుల వివరాలు, లింగనిర్ధాణ, ధరలు, ఫైర్‌సేఫ్టీ, రిజిస్ట్రేషన్ పరిశీలించారు. ఫైర్‌సేఫ్టీ ఎక్స్‌పైరీ తేదీని చూసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా రిజిస్టరైన దవాఖానలు నిబంధనలు పాటించాలన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధిక ఫీజులు తీసుకుంటే చర్యలు తప్పవన్నారు. ఇక్కడ తనిఖీ బృందం సభ్యులు రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ గైనకాలజిస్ట్ డాక్టర్ క్రాంతి, మిషన్ కోఆర్డినేటర్ యశోద, సఖీ కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి, కానిస్టేబుల్, కార్యాలయ సిబ్బంది, రాంప్రసాద్ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు పరిశీలించిన ఐటీడీఏ పీవో

ఉట్నూర్, ఏప్రిల్ 29: గుడిపేట గ్రామం లో చేపట్టిన అభివృద్ధి పనులను ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా మంగళవారం పరిశీలించారు. తిర్యాని మండలంలో వాసన్ సంస్థ ఆధ్వర్యంలో ఎల్ఐసీ-హెచ్ఎఫ్ఎల్ సహకారంతో అమలవుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. సంగమేశ్వర ఉమ్మడి నీటి వినియోగదారుల సంఘం ఏర్పాటు చేసిన సోలార్ ఇరిగేషన్ వ్యవస్థను పరిశీలించారు. జీవనోపాధిలో వచ్చిన మార్పులు వివరించారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టి అభివృద్ధికి కృషి చేయాలని, పేర్కొన్నారు. ఇక్కడ ఐటీడీఏ అధికారులు, జిల్లా మేడి మోతీరాం, ఆడా తాను, సీపీఎఫ్ ప్రతినిధులున్నారు.

## మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

ఎదులాపురం, ఏప్రిల్ 29: ఆదిలాబాద్‌లోని రాంనగర్‌కు చెందిన వహేబ్ ఉద్దీన్ 2009కి సంబంధించిన టేకు కలప పర్మిట్ల కోసం ఇచ్చోడ మండలం మాదపూర్‌కు చెందిన మల్లేశ్‌కు ఫోన్ చేయగా, కలప పర్మిట్లకు రూ.5 లక్షలు ఇప్పిస్తానని నమ్మించాడు. నిజమని నమ్మిన వహేబ్ ఉద్దీన్ రూ.18,500 ఫోన్ పే ద్వారా నాలుగు రోజుల క్రితం పంపించాడు. ఈక్రమంలో మోసపోయానని గ్రహించిన వహేబ్ ఉద్దీన్ మావల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి మల్లేశ్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు.

## అర్హులకు ఇండ్లు మంజూరు చేయాలి

బోథ్, ఏప్రిల్ 29 : అర్హులైన వారికే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని బీజేపీ బోథ్ మండల శాఖాధ్యక్షుడు బోరే రవీందర్ అన్నారు. మంగళవారం సొనాల మండల బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ మల్లేశ్‌కు వినతి పత్రం అందజేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక విషయంలో కమిటీ వారు సూచించిన పేర్లలో అనర్హులను ఎంపిక చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇక్కడ బీజేపీ నాయకులు బాశెట్టి రమేశ్, బండారి మురళి, తదితరులున్నారు.

## ధాన్యం దళారులకు అమ్మి మోసపోవద్దు

సోన్, ఏప్రిల్ 29 : ధాన్యం దళారులకు అమ్మి మోసపోవద్దని మార్కెట్ కమిటీ చైర్మన్ భీంరెడ్డి అన్నారు. మంగళవారం సోన్ మండలంలోని మాదాపూర్, పాక్‌పట్ల గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ కృష్ణప్రసాద్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బర్మగంగాదాస్, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, రాజేశ్వర్, శ్రీనివాస్‌రెడ్డి, వీడీసీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లర్ల దోపిడీని అరికట్టాలి

- ప్రధాన రహదారిపై బైఠాయించి రైతుల ధర్నా



ప్రధాన రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న రైతులు

దస్తురాబాద్, ఏప్రిల్ 29 : నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలోని పెర్కపల్లె గ్రామానికి చెందిన రైతులు రైస్ మిల్లర్ల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రోడ్డెక్కారు. దాదాపు మూడు గంటలకు పైగా ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. రైస్ మిల్లర్స్ యాజమానుల దోపిడీకి నిరసనగా నినాదాలు చేశారు. ధర్నాతో వాహనాలను ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ యాదవరావు రైతులతో మాట్లాడారు. విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని నచ్చజెప్పడంతో ధర్నా విరమించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. పెర్కపల్లె గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఒక సంచి దాదాపు 41 కిలోల 300 గ్రాముల తూకం వేస్తున్నట్లు తెలిపారు. కానీ.. రైస్ మిల్లులకు వెళ్లాక అక్కడి రైస్ మిల్లు యాజమానులు ఒక సంచి 43 కిలోల చొప్పున దించుకుంటామని, లేదంటే దించుకోమని అంటున్నారన్నారు. తరుగు పేరిట కూడా దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఒక క్వింటాలుకు 7 కిలోల వడ్లు అదనంగా తీసుకుంటున్నారని ఆవేదన చెందారు. ఒక లారీలో 800 బస్తాలకు 40 క్వింటాళ్ల ధాన్యం నష్టం జరుగుతుందని, దాదాపు రూ.90 వేల వరకు దోపిడీ జరుగుతుందని అన్నారు. అధికారులు వెంటనే స్పందించి రైస్ మిల్లు యాజమానులపై చర్యలు తీసుకోని, 41 కిలోల చొప్పున దించుకునేలా రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ ఎస్ఐ కృష్ణారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సంతోశ్, ఆర్ఐ రచన పాల్గొన్నారు.

## గోదాముకు రోడ్డు వసతి కల్పించండి

కుంటాల, ఏప్రిల్ 29 : కుంటాల మండలంలోని అందకూర్‌లో మంగళవారం భూ భారతి కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన కలెక్టర్‌కు గ్రామస్తులు సమస్యలను విన్నవించారు. గ్రామంలో ధాన్యం ఆరబెట్టడానికి సరైన కల్లాలు లేవని, గ్రామానికి దగ్గరలో ఉన్న ప్రభుత్వ భూమిలో కల్లం ఏర్పాటు చేయించాలని రైతు మల్లేశ్ కోరాడు. రైతులు ధాన్యం నిల్వ చేసుకోవడానికి రెండేళ్ల క్రితం రూ.40 లక్షలతో నిర్మించిన గోదాముకు సరైన దారి లేక నిరుపయోగంగా ఉందని రోడ్డు వసతి కల్పించాలని మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు దాసరి కిషన్ కలెక్టర్‌కు విన్నవించారు. అలాగే గ్రామ శివారులో ఉన్న కెనాల్‌లో పూడికతీత చేయకపోవడంతో సాగు భూములకు నీరందడం లేదని, దానికి మరమ్మతులు చేపడితే 200 ఎకరాల భూములకు నీరందుతుందని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అలాగే 30 ఏండ్ల క్రితం ప్రభుత్వం మాకు అసైన్డ్ భూమి కేటాయించిందని సిగం హన్మండ్లు తెలిపారు. పట్టా ఇచ్చిండ్రు కానీ మోక మీద భూమి చూపించట్లేదు. దయచేసి నాకు భూమి చూపించాలని కోరాడు.

## టెండర్ల ప్రక్రియ పూర్తి కాలేదు

బాసర, ఏప్రిల్ 29 : ఆర్జీయూకేటీ బాసరలో టెండర్ల ప్రక్రియ పూర్తయిందని వస్తున్న అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, టెండర్ల ప్రక్రియ కొనసాగుతున్నదన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా మొదట టెక్నికల్ రౌండ్ పూర్తయిందని, రెండవ ఫైనాన్షియల్ రౌండ్ కొనసాగుతున్నదని వీసీ తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తయందని కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారు. వాటిని ఎవరూ నమ్మవద్దని, ప్రతి ప్రక్రియ సంబంధిత అధికారులతో పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు.

## ఇద్దరు మేట్ల తొలగింపు

సారంగాపూర్, ఏప్రిల్ 29 : మండల ప్రజాపరిషత్ వద్ద మంగళవారం ఏప్రిల్ 1, 2024 నుంచి మార్చి 31, 2025 వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలో 32గ్రామ పంచాయతీలకు ప్రజావేదిక నిర్వహించాల్సి ఉండగా.. రాత్రి ఏడు గంటల వరకు 25 పంచాయతీలకు సంబంధించిన సోషల్ ఆడిట్ పూర్తయింది. మిగతా ఏడు పంచాయతీలకు సోషల్ ఆడిట్ కొనసాగుతోంది. మహావీర్‌తండాలో ఉపాధి హామీ పనులు చేయకుండా కొందరి బినామీ పేర్ల మీద ఇద్దరు మేట్లు డబ్బులు కాజేశారు. దీంతో ఇద్దరు మేట్లను అధికారులు తొలగించారు. అంతేకాకుండా విచారణ పూర్తయిన తర్వాత పెనాల్టీలు, రికవరీలు చేపడుతామని అధికారులు తెలిపారు. ఇందులో ఇన్‌చార్జి డీఆర్‌డీవో శ్రీనివాస్, ఏపీడీ నాగవర్ధన్, ఎంపీడీవో లక్ష్మీకాంతరావు, అంబుడ్స్‌మెన్ నవీన్, ఏవీవో లక్ష్మయ్య, ఎంపీవో అజీజ్‌ఖాన్, ఏపీ వో లక్ష్మారెడ్డి, ఎస్టీఎం దత్తు, ఎస్ఆర్‌పీ మహేశ్, డీఆర్‌పీ గంగాప్రసాద్, ఏఈపీఆర్ దేవిదాస్, ప్రత్యేకాధికారి బాలిక్ హమ్మద్ పాల్గొన్నారు.

## మూడు నెలల్లో తొమ్మిది బాల్యవివాహాలు అడ్డుకున్నాం

ఎదులాపురం, ఏప్రిల్ 29 : మూడు నెలల్లో తొమ్మిది బాల్యవివాహాలు అడ్డుకొని, రెండు కేసులు నమోదు చేయించామని ఆదిలాబాద్ బాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం బాల్‌రక్షక్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్షయ తృతీయ సందర్భంగా పురోహితులు, మౌలానా ఖాజీ, చర్చి పాస్టర్లకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. 18 సంవత్సరాల్లోపు అమ్మాయి, 21 సంవత్సరాల్లోపు అబ్బాయికి వివాహం చేస్తే రెండు సంవత్సరాల జైలు, రూ.లక్ష జరిమానాను కోర్టు విధించే అవకాశం ఉందన్నారు. ఎక్కడైనా బాల్య వివాహలు జరిగితే టోల్ ఫ్రీ నంబర్ 1800 1027 222 లేదా 1098,100కి సమచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## నాలుగు లేబర్‌కోడ్ల రద్దుకు పోరాడదాం

ఖానాపూర్ రూరల్, ఏప్రిల్, 29 : నాలుగు లేబర్‌కోడ్లను రద్దుకు పోరాడుదామని ఐఎఫ్‌టీయూ నాయకుడు సునారికారి రాజేశ్ అన్నారు. ఖానాపూర్ మండలంలోని సత్తనపల్లి గ్రామంలోని బీడీ హెడ్ ఆఫీస్ కార్యలయంలో కార్మికులతో 139 మేడే గోడప్రతులు విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా అధ్యక్షుడు సునారికారి రాజేశ్ మాట్లాడుతూ, నాలుగు లేబర్‌కోడ్ల రద్దుకు పోరాడదామని పేర్కొన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో సట్ల భోజన్న, కార్యదర్శి రామ్మోహన్, పంబాల రాజేశ్వర్, దాసరి పెద్దన్న, ఆత్రం భీంరావు, శ్రీనివాస్, మూడిక శేఖర్, కార్మికులు పాల్గొన్నారు.

## సేంద్రియ ఎరువులు వాడాలి

ఉట్నూర్ రూరల్, ఏప్రిల్ 29: రైతులు సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సూచించారు. మంగళవారం మండలంలోని నాగాపూర్ గ్రామంలోని దాల్‌మిల్ వద్ద మార్క్‌ఫెడ్, ప్రజామిత్ర రైతు పరస్పర సహకార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులు జొన్నలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలని అన్నారు. అనంతరం భూసార పరీక్ష యంత్రాన్ని ప్రారంభించారు. ఇక్కడ వ్యవసాయ అధికారి రమేశ్, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, నాయకులు, రైతులు, సంస్థ సభ్యులున్నారు.

## అడిషనల్ ఎస్పీకి హైమన్ డార్ఫ్ నివేదిక పుస్తకం బహూకరణ



అడిషనల్ ఎస్పీ కాజల్‌కి పుస్తకాన్ని బహూకరిస్తున్న గౌరవాధ్యక్షుడు కనక వెంకటేశ్వర్‌రావు

ఉట్నూర్, ఏప్రిల్ 29 : ఉట్నూర్ అడిషనల్ ఎస్పీ కాజల్‌ను హైమన్ డార్ఫ్ యూత్ గౌరవాధ్యక్షుడు కనక వెంకటేశ్వర్, మర్సుకోల జ్ఞానేశ్వర్ మంగళవారం కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివాసీ ఆత్మబంధువు ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్ బెట్టి ఎలిజబెత్ నివేదిక పుస్తకాన్ని బహూకరించారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 29: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి జిల్లా సంక్షేమాధికారి ఫైజాన్ అహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామీణ గిరిజన ప్రాంతాల్లో అక్షయ తృతీయ, వార్షిక వసంత కాలం పండుగ ఈ కాలంలో బాల్య వివాహాలు జరిగే అవకాశం ఉందని ఊహాగానాలు వినిపిస్తున్నాయన్నారు. ఈసందర్భంగా బాల్య వివాహాలు అడ్డుకునేందుకు జిల్లా స్థాయిలో అధికారులను నియమించినట్లు తెలిపారు. బాల్య వివాహాలు జరిపితే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. చిల్డ్రన్ హెల్ప్‌లైన్ 1098కి సమాచారం అందించాలన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్,29: మాతా శిశు సంక్షేమశాఖ ద్వారా నడుస్తున్న పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి దుర్గాభాయి దేశ్‌ముఖ్ మహిళా సాంకేతిక శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో అనాథల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి జిల్లా సంక్షేమ శాఖాధికారి ఫైజాన్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లమా ఇన్ సివిల్ ఇంజినీరింగ్ కోర్సులో (60), డిప్లమా ఇన్ ఎలక్ట్రికల్స్, ఎలక్ట్రానిక్స్, ఇంజినీరింగ్(60), డిప్లమా ఇన్ కంప్యూటర్ ఇంజినీరింగ్ (60), డిప్లమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్(60) కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు మే 20 లోపు కమిషనర్, మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ బాలరక్ష భవన్, గొల్లపేట, నిర్మల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## మాదక ద్రవ్యాలకు బానిస కావద్దు

నర్సాపూర్(జి), ఏప్రిల్ 29 : యువత మాదక ద్రవ్యాలకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఏఎస్పీ రాజేశ్ మీనా అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఏఎస్పీ రాజేశ్ మీనా, రూరల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, నర్సాపూర్(జి), దిలావర్‌పూర్, సారంగాపూర్ ఎస్‌లు సిబ్బందితో మండల కేంద్రంతోపాటు చాక్‌పల్లి, తిమ్మాపూర్ గ్రామాల్లోని పలు అనుమానితుల ఇళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నిషేధిత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల మత్తులో జీవితాలు పాడు చేసుకోవద్దని సూచించారు. అక్రమంగా మాదక ద్రవ్యాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## వేతనాలు పెంచాలని వినతి

భైంసా, ఏప్రిల్, 29 : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల వేతనాలను ప్రభుత్వం జీవో నంబర్ 60 ప్రకారం జీతాలు పెంచాలని మంగళవారం ఆర్డీవో సిబ్బందికి మాజీ కౌన్సిలర్ కపిల్ సిందే వినతి పత్రం అందజేశారు. అంతే గాకుండా ప్రతి నెలా వేతనాలను బ్యాంకు అకౌంట్‌లలో జమచేయాలని కోరారు.

## గంజాయి విక్రయిస్తున్న ఒకరి అరెస్ట్

భైంసా, ఏప్రిల్, 29 : పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఒకరిని అరెస్ట్ చేసినట్లు సీఐ జీ గోపినాథ్ తెలిపారు. మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా మాలేగాంకు చెందిన ముజమ్మిల్ హుస్సేన్‌కు భైంసాకు చెందిన మహిళతో వివాహం కాగా కొద్ది రోజులుగా పట్టణంలోని ఓవైసీ నగర్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలో మహారాష్ట్ర నుంచి గంజాయి తెచ్చి స్థానికంగా విక్రయించేవాడు. మంగళవారం సైతం భోకర్ చౌరస్తాలో గంజాయి విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు పోలీసు, రెవెన్యూ, జిల్లా క్లూస్ టీం సంయుక్తంగా దాడులు జరిపారు. దీంతో 1.140 కేజీల ఎండు గంజాయి పట్టుబడగా ఈ మేరకు స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపినట్లు సీఐ వెల్లడించారు.

## ఇద్దరు దొంగలు..

ఎదులాపురం, ఏప్రిల్ 29 : గత నెలలో ఎంప్లాయీస్ కాలనీ, ఈనెల 23వ తేదీన న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీలోని పలు ఇండ్లల్లో దొంగతనాలు చేసిన ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని రూరల్ సీఐ ఫణిధర్ తెలిపారు. మంగళవారం మావల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌లు విష్ణువర్ధన్, పవర్ గౌతమ్‌తో కలిసి సీఐ వివరాలు వెల్లడించారు. రాణిదివ్య నగర్‌కు చెందిన కిరణ్, గాంధీనగర్‌కు చెందిన సమీర్‌ఖాన్ అలియాస్ రోహిత్, రాణిదివ్య నగర్‌కు చెందిన బాలిపై కేసు నమోదు చేయగా కిరణ్, సమీర్ ఖాన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. రాణిదివ్య నగర్‌కు చెందిన బాలి పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి టీవీ, ట్యాబ్, సెల్‌ఫోన్, తులంనర వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నామన్నారు.

## తహసీల్దార్ ఎదుట ఇద్దరి బైండోవర్

సోన్, ఏప్రిల్ 29 : నిర్మల్ పట్టణంలోని విశ్వనాథ్‌పేట్ కాలనీలోని పాన్‌షాపులో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు నిర్మల్ రూరల్ పోలీసులు మంగళవారం తనిఖీ చేసి తహసీల్దార్ ఎదుట ఇద్దరిని బైండోవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు. కాలనీకి చెందిన షేక్ ఖమర్, షేక్ సోహెల్ గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఏఎస్పీ రాజేష్‌మీనా సిబ్బంది చేరుకొని పాన్‌షాపుల్లో తనిఖీ చేశారు. భవిష్యత్‌లో ఎలాంటి మత్తుపదార్థాలు అమ్మవద్దని ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు మత్తుపదార్థాలు లేని జిల్లాగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సేవలు సద్వినియోగం చేసుకోవాలి

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 29 : మిషన్ శక్తి సేవలు సద్వినియోగం చేసుకోవాలని మిషన్ శక్తి కోఆర్డినేటర్ సవిత అన్నారు. మంగళవారం నిర్మల్ పట్టణంలో మహిళా సాధికారతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే అమ్మాయిలు వివాహం చేసుకోవాలని, ముందే చేసుకుంటే శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. షీటీం, భరోసా, సఖీ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జ్యోతి, మౌనిక, ఆర్థిక అక్షరాస్యత నిపుణురాలు శైలజ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి ఉషు పోటీలకు ఎంపిక

భైంసా, ఏప్రిల్, 29 : ఈ నెల 26 నుంచి 28వ వరకు అమెచ్యూర్ ఉషు అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో సిరిసిల్ల జిల్లాలో జూనియర్, సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి ఉషు క్రీడల ఎంపికలు జరిగాయి. ఈ ఎంపికలకు నిర్మల్ జిల్లా నుంచి 25 మంది క్రీడాకారులు పాల్గొనగా 11బంగారు పతకాలు, 6 రజత పతకాలు, 4 కాంస్య పతకాలు సాధించినట్లు ఉషు శిక్షకుడు సాయికృష్ణ మంగళవారం తెలిపారు.